# ఫటరెన్స్

ఎమ్. వి. వి. సత్యనారాయణ



"జాగ్రత్తగా మార్చాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా మన రాకెట్ అంతా కటకటాల వెనక్కి పోతుంది" అన్నాడు ఆ వ్యక్తి. గుబురు మీసాలూ, నల్ల కళ్లద్దాలూ మొహం ఎప్పుడూ గుర్తుపట్ట డానికి వుండదు.

"ఆ విషయం నాకు తెలియదా!" నవ్వాడు జోగారావు.

ఆ వ్యక్తి కూడా నవ్వాడు జోగారావు ఏడాది తిరిగేసరికి బికారిగా వుండే వాడల్లా లక్షాధికారి అయ్యాడు. ఆ సంగతి ఇద్దరికీ తెలుసు!

గుబురుమీసాల వ్యక్తి సొరుగు తెరచి నోట్లకట్ట టేబులు మీదకు విసిరాడు. అన్నీ వందరూపాయల నోట్లు! జోగారావు ఆప్యాయంగా తళతళలాడే నోట్ల కట్టనుతడిమి ప్యాంటు జేబులో కుక్కాడు గుబురు మీసాల వ్యక్తి వద్ద సెలవు తీసుకుని గదిలోంచి బయటపడ్డాడు చకచక వరండాలో నడిచి మెట్లు దిగటం ప్రారంభించాడు.

"బూట్ పాలిష్ సార్!"

కింద మెట్లమీద కేక వినిపించింది. నత్తగుల్ల ఆకారం మెట్లు అవి. జోగారావు తనకేం పట్టనట్టు చకచక మెట్లుదిగుతూ ఆలోచనలోపడ్డాడు.

నోట్లకట్ట మారిస్తే తనచేతిలో పాతిక వేలు పడతాయి దాంట్లో సగం గుబురు మీసాల వ్యక్తికి, సగం తనకి! ఒక్క పూటలో మార్చగలడు తాను. పూటకి ఆదాయం!

జోగారావు నవ్వుకున్నాడు...

పన్నెండున్నర వేళా! విశాఖపట్నంలో ఈ లంకంత భవనంలో_ఒక గదిలో_ అద్దెగదిలో నాలుగురోడ్ల జంక్షన్‌లో యింత పెద్ద ఎత్తున దొంగనోట్ల మార్పిడి జరుగుతోన్నా ఎవ్వరికీ తెలియదు. జోగారావు హుషారుగా ఈలవేసి మెట్ల ప్రక్కన వున్న అద్దాల కిటికీల్లోంచి రోడ్డుమీదకు చూశాడు.

జనం! జనం! ఎవరికీ ఎవరూ పట్టించుకోనట్టూ .... ఎవరి హడావిడిమీద వాళ్ళు పరుగులు పెడుతోన్నట్టు ఎవరి గొడవ వారికే విపరీతమైన ప్రాముఖ్యత వున్నట్టు...ఉరుకుల పరుగులు!

అన్ని పరుగులూ పొట్టకోసమే!

జోగారావు గర్వంగా ఉబ్బివున్న పాంటుజేబు తడుముకున్నాడు.

కాని, తన పరుగు మటుకు భవిష్యత్తు కోసం! తరతరాలు తిన్నా తన ఆస్తి తరగకూడదు.

"సార్! మీ బూట్లు పాలిష్ చేయనా!"

జోగారావు చటుక్కున విలాదొక్కుకున్నాడు. తను మరో రెండుమెట్లు దిగి వుంటే ఆ కుర్రవాడిని గుద్దుకుని వుండేవాడు. వాడు క్రిందకు దొర్లిపోయేవాడు. వాడిమీద కోపం ముంచుకువచ్చింది_ కిందపడి దెబ్బలుతింటే! అల్లరి! చుట్టూ జనం మూగరా!

"ఏరా! బతకాలని లేదా!" అరిచాడు జోగారావు.

బూట్ పాలిష్ కుర్రవాడు తలపైకెత్తి చిరునవ్వు నవ్వి, తన చంకన వున్న మసిబారిన సంచీ తడుముకుని, "సార్! బతకాలనే గదా! గుమ్మం గుమ్మం తిరుగుతూ పాలిష్ చేసుకుంటున్నాను." అన్నాడు.

జోగారావు చిరాకుగా చూచి అతడిని తప్పించుకుని దిగబోయాడు.

"సార్!" కుర్రవాడు ప్రాధేయపడ్డాడు.

జోగారావు రెయిలింగ్ పట్టుకుని దర్పంగా అతడికేసి ఏం అన్నట్టు చూశాడు.

"మీ బూట్లు పాలిష్ చేస్తాను సార్!"

"అక్కర్లేదురా! మరో రెండురోజులవరకూ అక్కర లేదనుకుంటాను."

"సార్! అలా అనకండి సార్! మాఅమ్మ, మా తమ్ముడూ, చెల్లీ తిండి తిని రెండు రోజులవుతుంది సార్! నేను పాలిష్‌చేసి పట్టుకెళ్తే గాని ఈ పూట అయినా మాకు తిండి వుండదు సార్!"

"మీ నాన్న ఏమయాడు!"

"ఆరు నెలలయి మమ్మల్ని వదిలేశాడు సార్! బాగా తాగుతాడు. గితాగి మా అమ్మను చితకదన్నేవాడు. మా నాన్న పోయినప్పటినించీ నేనే కుటుంబానికి గంజి పోయవలసినవాడిని సార్!"



"నీకు వట్టినే డబ్బులు యివ్వడానికే పాలిష్ చేయించుకోవాలి."

"పోనీ సగం డబ్బులివ్వండి సార్!" మామూలుగా అయితే పాలిష్‌కి అర్ధ రూపాయి!"

జోగారావుకి జాలివేసింది.

"అయితే పుట్ రెస్ట్ తియ్యి."

కుర్రవాడు చటుక్కున గొంతు కూర్చుండి మోకాలు ముందుకు ఒంచి, "సార్! బూటు నా మోకాలి మీద పెట్టండి." అన్నాడు.

జోగారావు అతడి మోకాలికేసి చూశాడు. తను బూటు పెడితే విలదొక్కుకోలేనంత అల్పంగా వుంది మోకాలు.

"పుట్ రెస్ట్ కొనుక్కోలేక పోయావా!"

"కొనాలంటే మాటలా సార్! పది రూపాయలకు తక్కువకి రాదు. బూటు యిక్కడ పెట్టండి సార్!"

"పోనీలేవోయ్! ఇదిగో అర్ధరూపాయి తీసుకో!" అన్నాడు జోగారావు జేబులోంచి అర్ధరూపాయి తీసి యివ్వబోతూ.

పాలిష్ కుర్రవాడు తల అడ్డంగా తిప్పి, "నాకు ఉచితంగా వద్దు సార్!" అంటూ బూటుమీద చెయ్యివేసి మెల్లగా ఎత్తి మోకాలిమీద పెట్టి చకచక సంచి లోంచి పాలిష్ డబ్బానూ బ్రష్‌నూ తీసి మెట్టుమీద పెట్టి వేలితో చకచక పాలిష్ బూటుమీద అద్ది మెరుపువేగంతో బ్రష్‌తో రబ్ చేయసాగాడు.

"నీకు ఎన్నేళ్ళురా?"

"పదహారు సార్!"

"..........."

"ఏం సార్!"

"ఇంకా ఎక్కువ వయసువున్న వాడల్లే కనిపిస్తావురా!"

"సార్ నేను ఎలా పాలిష్ చేస్తున్నా నంటారు?"

జోగారావు మెచ్చుకోలుగా చూసి కాలు మార్చి రెండో బూటు అతడి మోకాలిమీద పెట్టి యధాలాపంగా రోడ్డు కేసి చూశాడు.

జోగారావు మొహంలో రంగులు మారాయి. జీపు వచ్చి నిలబడింది. మనుషులు దిగారు చక చక భవంతి చుట్టూ పరుచుకుపోసాగారు. ముగ్గురు వ్యక్తులు భవంతిలో ప్రవేశించడం చూశాడు జోగారావు. అతడిలో వణుకు ప్రారంభమయింది.

వాళ్ళు క్రైంబ్రాంచ్ మనుషులు! తనకి వాళ్ళంతా తెలుసు తనూ వాళ్ళం దరికీ తెలుసనే విషయం జోగారావుకు తెలుసు.

జోగారావు చటుక్కున పాలీషు కుర్రవాడి వంక చూశాడు అతడు తదేకంగా బూటుకు మెరుగు పెట్టడంలో నిమగ్నమైపోయాడు.

జోగారావు చటుక్కున పాంటు జేబులోంచి నోట్లకట్ట తీసి మెల్లగా వంగి పాలీషు కుర్రవాడి చంకలోవున్న సంచిలోకి జారవిడిచాడు.

"పూర్తయింది సార్! పావలా యివ్వండి," అన్నాడు కుర్రవాడు, పాలీషు డబ్బానీ బ్రషునూ సంచిలోకినెట్టి.

జోగారావు అతడి చేతిలో అర్ధ రూపాయి పెట్టి, "ఒరే! జగదాంబా బస్‌స్టాప్‌లో నిలబడు నీకు పుట్‌రెస్ట్ కొనడానికి డబ్బు యిస్తాను." అన్నాడు.

పాలీషు కుర్రవాడి కళ్ళు మిల మిల లాడాయి.

"అదే వుంటేనా సార్! నా సామి రంగా! రోజుకి మూడు రూపాయలు సంపాదిస్తాను సార్!"

మెట్లమీద బూట్లు టకటకలాడుతూ చప్పుడయాయి.

పాలీషు కుర్రవాడు అటుగా చూశాడు. ఒకరి వెనక ఒకరు మెట్లెక్కుతూ జోగారావును చూచి ముగ్గురూ ఆగారు.

"జోగారావుగారూ! ఇక్క డున్నారేం?" అడిగాడు ముగ్గురిలో ఒకాయన. జోగారావు విభ్రాంతగా చూసి, "మా ఫ్రెండు ఈ లాడ్జిలో దిగాడని తెలిసి వచ్చాను. ఇంతలో ఈ కుర్రవాడు పాలీషు అంటూ వెంటపడ్డాడు." అన్నాడు.

వాళ్ళ గాంభీర్యానికి పోలీసు కుర్రవాడు భయాన్ని శంకించాడు. మెల్లగా మెట్లు దిగి రోడ్డెక్కాడు

"జోగారావుగారూ! మీ దగ్గర దొంగ కరెన్సీనోట్లున్నట్టు మాకు వార్త అందింది. వెతకవచ్చునా?" అడిగాడు ఇందాక అడిగినాయన

"వెతుక్కోండి ఇన్‌స్పెక్టర్!" అంటూ జోగారావు చేతులెత్తాడు.

* * *

"చాల త్వరగా వచ్చేసారు సార్!"

"ఆ ప్రక్క సందులోకి పద! నేను సిగరెట్లు కొనుక్కువస్తా!" అంటూ అతడి జవాబుకోసం ఎదురుచూడకుండా కిళ్ళీ షాప్‌కేసి నడిచాడు జోగారావు.

పోలీసు కుర్రవాడు సందులోకి మలుపు తిరిగాడు జోగారావు కూడా చుట్టూ చూసుకుంటూ సందులోకి మలుపు తిరిగి కుర్రవాడిని సమీపించి, "ఆ సంచి యిక్కడ పెట్టి అగ్గిపెట్టె తెచ్చిపెట్టు.... మరచిపోయాను" అన్నాడు

పోలీసు కుర్రవాడు ఏమీ సంకోచించకుండా సంచిని రోడ్డువారగా పెట్టి అతడి దగ్గర డబ్బులు తీసుకుని పరుగెత్తాడు.

జోగారావు సంచి వెతికి నోట్లకట్ట తీసి చటుక్కున పాంటుజేబులో కుక్కుకున్నాడు.

పోలీసు కుర్రవాడు అగ్గిపెట్టెతో తిరిగి వచ్చి చిల్లర డబ్బులు జోగారావుకు యివ్వబోయాడు జోగారావు అతడి చెయ్యి ముందుకునెట్టి జేబులోంచి పదిరూపాయల నోటు తీసి కుర్రవాడి చిరుగుల జేబులో కుక్కి చకచక నడుచుకుంటూ మలుపు తిరిగి జనంలో కలసిపోయాడు.

పోలీసు కుర్రాడు వెర్రిమొహం వేసుకొని నిలబడిపోయాడు.

* * *

జోగారావు ఆ రోజు దినపత్రిక చూస్తూ నిర్ఘాంతపోయాడు గుబురు మీసాల వ్యక్తి ఫోటో పేపర్లో పడింది ఇరవై లక్షల రూపాయల దొంగనోట్లతో సి ఐ డి వారికి దొరికిపోయాడు.

"సార్!"

తలెత్తి చూశాడు జోగారావు. పోలీసు కుర్రవాడు.

అతడిని చూస్తూనే ప్రక్కలో బాంబు పడినట్లుగా చూశాడు జోగారావు.

"సార్! తమరిచ్చిన పది రూపాయలతో ఫుట్‌రెస్ట్ కొన్నాను సార్! సరిగ్గా రెండు రోజుల్లో పదిరూపాయలు మిగల్చగలిగాను." అంటూ పది రూపాయలు జోగారావు ముందున్న టీపాయ్ మీద పెట్టాడు.

జోగారావు తేరుకుని, "నా అడ్రసు ఎలా తెలిసిందోయ్?" అన్నాడు

"అదే నాకూ తెలియదు సార్? నా సంచిలో చిన్న కార్డు పడివుంది. మీ అడ్రసు వుంది"

జోగారావు మనస్సు శాంతించింది.

"నాకు యివ్వనక్కరలేదు ....... తీసుకో!" అన్నాడు

"క్షమించండి సార్! వూరకనే ఏమీ తీసుకోను... సెలవు!" ఆ కుర్రవాడు వెనక్కి తిరిగి పరుగెత్తాడు.